ఆత్మీయ సమ్మేళనం

నిడమనూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991- 92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మూడు దశాబ్దాల తర్వాత ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకొని ఒకే వేదికపై కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడ్డ వారు వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు కె.కుబేరుడు, గోపాల్‌రెడ్డి, మజీద్, రంగారెడ్డి, సీతయ్య, నర్సింహను ఘనంగా సత్కరించారు. రియల్ ఎస్టేట్ వ్యాపార అధినేత వెంపల సతీష్‌రెడ్డి. పూర్వ విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎం.శ్రీనివాస్, వెంపల సతీష్‌రెడ్డి, ఇరుగుల శ్రీనివాస్‌రెడ్డి, సుబ్బారావు, తోట శ్రీను, రాణి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2012-13 లో పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు పీడీ సైదులు, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, రజిత, సుజాతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మన్సూర్, బ్రహ్మచారి, శైలజ, మాధవి, మహేష్, నవీన్, అనిల్‌కుమార్, శ్రీను, నాగరాజు, నాగమ్మ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను 1969లో ఏర్పాటు చేశారు. కళాశాలను స్థాపించి 55 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 1969-2024 మధ్యలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ కళాశాలకు చదువుకున్న ఎంతో మంది పూర్వ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. వారందరూ ఒక్కచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను మిత్రులతో పంచుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు.



నిడమనూరు : ఆత్మీయ సమ్మేళనంలో 1991- 92 బ్యాచ్ విద్యార్థులు



నిడమనూరు : పూర్వవిద్యార్థులతో, ఉపాధ్యాయులు





దేవరకొండ : ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



గుర్రంపోడు: లబ్ధిదారునికి చెక్కు అందిస్తున్న జగదీశ్వర్‌రెడ్డి

గుర్రంపోడు : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని నాగార్జునసాగర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కమతం జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. వద్దిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన వద్దిరెడ్డి అనసూర్యకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.43,500 విలువైన చెక్కును ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మాజీ సభ్యుడు కుసిరెడ్డి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

పల్లె దవాఖానాను ప్రారంభించాలి



మాట్లాడుతున్న నవీన్

డిండి: డిండి మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాను వెంటనే ప్రారంభించాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనమల నవీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పల్లె దవాఖానాను ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని, డిండి పీహెచ్‌సీకి వెళ్లడానికి తిప్పలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆ సంఘం మండల అధ్యక్షుడు నరేష్, మహేష్, మల్లేష్, సైదులు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాసామగ్రిని అందజేస్తున్న శ్రీకాంత్

కొండమల్లేపల్లి: యువత జీవితంతో పాటు క్రీడల్లోనూ రాణించాలని యం.ఎస్.ఎఫ్ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్ల శ్రీకాంత్ జాంభవ్ సూచించారు. ఆదివారం చింతపల్లి మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామ యువతకు తన వంతుగా వాలీబాల్, వాలీబాల్ నెట్ అందజేసి మాట్లాడారు. క్రీడలు మనిషికి మానసిక, శారీరక ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. అందుకే ప్రభుత్వాలు పాఠశాల విద్య నుంచి క్రీడలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పరమేష్, శివక్రిష్ణ, ఆదినారాయణ, నజీర్, నరసింహ, హరికృష్ణ, చింటు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొండమల్లేపల్లి: జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొండమల్లేపల్లి తహసీల్దార్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న కుటుంబ పెద్దలో పురుషుడు లేదా మహిళ సహజ మరణం లేదా ప్రమాదవ శాత్తు మరణించినట్లయితే ఆ కుటుంబానికి తక్షణమే రూ.20,000 నగదు ఆర్థిక సాయం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరణించిన వ్యక్తి మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, వ్యక్తిగత గుర్తింపు పత్రం, ఆధార్ లింక్ చేసిన బ్యాంకు ఖాతా లేదా పోస్ట్ ఆఫీస్ ఖాతా, పాస్ పోర్ట్ సైజు ఫొటోను దరఖాస్తుకు జతచేసి ఇవ్వాలని వివరించారు.

జాతీయ సమైక్యత శిబిరానికి విద్యార్థుల ఎంపిక



శశికుమార్



అజయ్

నాగార్జునాసాగర్ : తమిళనాడులో నిర్వహించనున్న జాతీయ సమైక్యత శిబిరానికి సాగర్ మహాత్మా జ్యోతిబా పూలే జూనియర్ కళాశాల విద్యార్థి ఇ.అజయ్, డిగ్రీ కలశాల విద్యార్థి శశికుమార్ ఎంపికైనట్లు ఆయా కళాశాల ప్రిన్సిపాల్‌లు రవికుమార్, మాధవీలతలు తెలిపారు. తమిళనాడులోని తాంజావూరులో నేషనల్ ఇంటి గ్రేట్ క్యాంపునకు అర్హత సాధించినందుకు వీరిని అభినందించారు. ప్రతి విద్యార్థి ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొని సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. జాతీయ సేవా పథక కోర్డినేటర్లు లలిత, కృష్ణలు, అధ్యాపకబృందం విద్యార్థులను అభినందించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వాడపల్లిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ అధికారులను కోరారు. ఆదివారం వాడపల్లి గ్రామంలో ప్రజా సమస్యలపై సీపీఎం నాయకులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పిచ్చి మొక్కలు మొలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారని, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని అన్నారు. ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించాలని కోరారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వినోద్, ఖాజా, సీపీఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లిలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

యూరియా అందుబాటులో ఉంచాలి

మాడుగులపల్లి : మండలంలో రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని బొమ్మకల్, బీమనపల్లి, చర్లగూడెంతో పాటు పలు గ్రామాల్లో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందుగా పంట సాగు చేసిన రైతులకు యూరియా అందక ఆందోళన చెందుతున్నారని, అధికారులు మండల వ్యాప్తంగా అన్ని పీఏసీఎస్ కేంద్రాలకు యూరియా సరఫరా చేసి రైతులకు సరిపడా అందించాలని కోరారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను కోత పెట్టకుండా అందించాలన్నారు. పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తక్షణమే మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రజలకు మిషన్ భగీరథ నీటిని సక్రమంగా అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, పుల్లెంల శ్రీకర్, వెంకటాచారి, నాగమణి, సుధాకర్ రెడ్డి, మమత తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న దేవిరెడ్డి అశోక్‌రెడ్డి

యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ

హాలియా : రైతాంగానికి సరిపడా యూరియా అందించడంలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ విమర్శించారు. ఆదివారం హాలియా పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సీపీఎం నాగార్జునసాగర్ నియోజకవర్గస్థాయి సమావేశం స్టడీ సర్కిల్ జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నా రాష్ట్ర రైతాంగానికి ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి 9.80లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటి వరకు 5.32లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చిందని, దీనితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగానికి సరిపడా యూరియా సరఫరా చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 25న ఏఓ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ మండలాల కార్యదర్శులు ద్రైద శ్రీను, కందుకూరి కోటేష్, రవినాయక్, నాయకులు ఆకారపు నరేష్, కొప్పు వెంకన్న, కోరే రమేష్, కారంపూడి ధనమ్మ, దొంతల నాగార్జున, గోగుల ఐద్దయ్య, మల్లికంటి చంద్రశేఖర్, మహేష్, జగదీష్, పాదిల వెంకన్న, వల్లపు వెంకన్న, మల్లయ్య, జానీ ఉన్నారు.

ఘనంగా బోనాల పండుగ

డిండి: డిండి మండల కేంద్రంలో యాదవులు దయానంద లింగమయ్య స్వామి బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బోనమెత్తిన మహిళలు, మామిడి తోరణాలు, పూలతో అలంకరించిన ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు స్థానిక బొడ్రాయి వద్ద నుంచి బయలు దేరి గ్రామ పురవీధుల గుండా తిరుగుతూ స్వామి వారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం లింగమయ్య స్వామికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భయ్యా మల్లయ్య, సలయ్య, విజయ్, తిర్పతయ్య, రాజు, మల్లయ్య, నిరంజన్, శ్రీశైలం, అంజి, రేణయ్య, భరత్, లింగమయ్య, లక్ష్మమ్మ, మల్లమ్మ, అంజమ్మ, పద్మ, రేణమ్మ పాల్గొన్నారు.



బోనాలతో మహిళలు

చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



వినాయక ఉత్సవ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణయ్య



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ, హాజరైన యువకులు, నాయకులు

మాడుగులపల్లి : వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ కృష్ణయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహాలను ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదని తెలిపారు. నిర్వాహకులు మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చూడాలని సూచించారు. వినాయక నిమజ్జనం పూర్తయ్యేంతవరకు నిర్వాహకులదే బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

నిడమనూరు : పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని నిడమనూరు ఎస్ఐ ఉప్పు సురేష్ సూచించారు. ఆదివారం కొత్త పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో స్థానిక పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా ప్రతి మండపానికి పోలీస్ వారి అనుమతి తీసుకోవాలని, గణేష్ మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని, శబ్ద కాలుష్యం కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి జరుపుకోవాలని ఎస్ఐ సూచించారు.

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి తీరని లోటు

- ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: సీపీఐ అగ్రనేత,నల్లగొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి తీరని లోటని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు.ఆదివారం హైదరాబాద్‌లోని మగ్దూం భవన్‌లో సుధాకర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి వామపక్ష భావజాలం కలిగిన సుధాకర్‌రెడ్డి నమ్మిన సిద్ధాంతం కోసం అవిశ్రాంత పోరాటం చేసారని కొనియాడారు. నల్లగొండ ఎంపిగా పని చేసిన సమయంలో బడుగు,బలహీన వర్గాల సంక్షేమానికి ఎంతగానో కృషి చేశాడని ఆయన గుర్తు చేశారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

సుధాకర్‌రెడ్డికి నివాళి

డిండి: సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధకాకర్‌రెడ్డికి డిండి మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేశారు.

సురవరం మరణం సీపీఐకి తీరని లోటు

కొండమల్లేపల్లి: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, నల్లగొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ కొండమల్లేపలి మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సురవరం చిత్ర పటానికి సీపీఐ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా ప్రజలకు తాగు, సాగునీరు అందించడానికి రైతులతో కలిసి వందల కిలోమీటర్లు సురవరం పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కౌన్సిల్ మెంబర్ కల్లు చరణ్ రెడ్డి, పట్టణ కార్యదర్శి సోమ్లా నాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు సురేందర్‌రెడ్డి మృతి



సురేందర్‌రెడ్డి (ఫైల్)

హాలియా : మండలంలోని ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యడవల్లి సురేందర్ రెడ్డి (66) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. సురేందర్ రెడ్డి కొద్ది రోజుల క్రితం బ్రెయిన్ ట్యూమర్‌కు గురై హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన మృతి పట్ల మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి , కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. సురేందర్‌రెడ్డికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

త్రిపురారం : గ్రామాల్లో గణేష్ ఉత్సవాలను మతాలకుఅతీతంగా ప్రశాంతంగా నిర్వహించాలని త్రిపురారం ఎస్ఐ గైకూరి నరేష్ సూచించారు. గణేష్ ఉత్సవాలపై ఆదివారం త్రిపురారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, గ్రామాల ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గణేష్ మండపాన్ని పోలీస్ నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ చేసుకోవాలని, ప్రతి విగ్రహాన్ని జియో ట్యాగింగ్ చేసి నంబర్ కేటాయిస్తామన్నారు. చర్చి, మసీద్‌లు, వీధుల్లో గణేష్ విగ్రహాల ఏర్పాటులో జాగ్రత్తలు పాటించాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, శోభాయాత్రను ఎలాంటి అల్లర్లు లేకుండా చూసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల వ్యాప్తంగా ఉన్న డీజే నిర్వాహకులను తహసీల్దార్ ముందు బౌండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, కసిరెడ్డి నరేష్, బీజేపీ మండల అధ్యక్షుడు రెమడాల రమేష్, మర్ల చంద్రారెడ్డి, కామర్ల జానయ్య, అనుముల శ్యాం సుందర్ రెడ్డి, పావనగుండ్ల వెంకటాచారి, బైరం కృష్ణ, జంగిలి శ్రీనివాస్, నగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



త్రిపురారంలో గణేష్ ఉత్సవాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గైకూరి నరేష్

తరి రాము సేవలు అభినందనీయం



తరి రామును సన్మానిస్తున్న బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్

హాలియా : పెద్దవూర మండల విద్యాధికారి తరి రాము సేవలు అభినందనీయ మని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ పేర్కొన్నారు. ఆదివారం హాలియా పట్టణంలో బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ మండల విద్యాధికారిగా అవార్డు అందుకున్న తరి రామును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎంతో తరి రాము కృషి చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించి మెరుగైన పీఆర్‌సీని ఇవ్వాలని, రెండు సంవత్సరాలకు పైబడి పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు గణపురం నిరంజన్, నరందాస్ దుర్గా ప్రసాద్, మన్నెం వెంకటేశ్వర్లు, తీరందాస్ రవి, రహీం, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు

హాలియా : యువత మాదకద్రవ్యాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు వినూత్న ప్రచారం చేస్తున్నారు. తనకు సెలవు ఉన్న రోజు, ఖాళీ సమయంలో జాతరలు, సంతలు, జనాలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక వేషధారణలో డ్రగ్స్ నివారణపై వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. రాచకొండ ప్రభాకర్ సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. సెలవులు, ఖాళీ సమయంలో సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం హాలియా పట్టణంలో సంత రద్దీగా ఉండడంతో విచిత్రమైన వేషధారణలో ఒక చేతిలో మైక్ పట్టుకొని మరోచేత్తో కరపత్రాలు పంచుతూ డ్రగ్స్‌తో కలిగే అనార్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాచకొండ ప్రభాకర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు.



ప్రచారం చేస్తున్న ప్రభాకర్

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమ ఊరేగింపు

గుర్రంపోడు : శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం గ్రామంలో తొమ్మిది రోజుల పాటు నిత్యపూజలు అందుకున్న కృష్ణ భగవానుడి ప్రతిమకు ఆదివారం ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. చైత్ర సిద్ధాంత ప్రబోధ సేవాసమితి నల్లగొండ కమిటీ, జిల్లా అధ్యక్షుడు పగిడిమర్రి వెంకటేశం ఆధ్వర్యంలో జరిగిన ముగింపు ఉత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవ నిర్వాహకుడు రవి, మేకల శ్రీనివాసులు., చక్రధర్, చంద్రమౌళి, జాల సైదులు, పరమేష్, తిరుమలేష్, కాశయ్య, వెంకటేశ్వర్లు, నర్సింహా రావు, వెంకటమ్మ, శోభ, సరిత, మమత, పార్వతమ్మ, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

బీఎస్పీలో చేరిక

హాలియా : నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పలు పార్టీల కార్యకర్తలు ఆదివారం హాలియా పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రావులపాటి రవిశంకర్ సమక్షంలో బీఎస్పీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఎస్పీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్ అబ్దుల్ బిన్ సోయల్ పాషా, షేక్ ఇబ్రహీం(బాబుల్) షేక్ ఖాలాం, రమావత్ కిరణ్ నాయక్, ఎడవెల్లి అనిల్‌కుమార్, అంజన్, వినోద్, విజయ్, గోపి తదితరులు ఉన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రవిశంకర్

నూతన కమిటీ ఎన్నిక



గౌడ సంఘం అధ్యక్షుడి ఏకగ్రీవ ఎన్నిక

కొండమల్లేపల్లి: చింతపల్లి మండల పరిధిలోని మదనాపురం గ్రామంలో ఆదివారం గౌడ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మదనాపురం గ్రామానికి చెందిన మోగుతాళ యాదగిరి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సురుగురి శ్రీనివాస్, ముద్దం మహేష్, శివ, మల్లయ్య, బుచ్చయ్య, సత్యనారాయణ, శ్రీను, జంగయ్య, శేఖర్, కుమార్, సాయిలు, ఆకారం, పరమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

నల్లగొండ టౌన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా ఇవ్వాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఈ నెల 25న హైదరాబాద్‌లో ఆర్. కృష్ణయ్య చేపట్టనున్న సత్యాగ్రహ దీక్షకు అధిక సంఖ్యలో బీసీలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కొంపల్లి రామన్నగౌడ్, మధు, దన్నంపల్లి హరీష్, కాడ శివ, కీసర నరేష్, మొగిలిచర్ల నిరంజన్ పాల్గొన్నారు.

నేడు సత్యాగ్రహ దీక్ష

నల్లగొండ టౌన్: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం జరుగనున్న బీసీల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.